బ్లౌస్ పీస్

సరస్వతి మంచి చాకచక్యము గల మనిషి. అందులో చెప్పదలచినది, వెంటనే చెప్పక చుట్టుత్రిప్పి చెప్పగల నేర్పు అపారము.

ఒకరోజు "మీ స్నేహితుడు, మనలను భోజనానికి పిలిచి విందు చేశాడే ఆయన" యని మాట నిలిపినది.

"విందా! ఎప్పుడు, ఏ స్నేహితుడు? ఎందుకు పిలిచాడు?" ఇవి ఆలోచించుటకు అధమం అయిదు నిమిషాలయినా పట్టవచ్చును.

అయితే సరస్వతి భర్తకు మాత్రం ఆ కష్టములేదు. ఎందుకంటే ఆయన ఇవన్నీ ఆలోచించడు.

"ఇదిగో, సరసూ, ఈ కాగితాలు నా బల్లమీద పెట్టు. కాఫీ ఏమన్నా వేడిగావుందా? వుంటే పట్రా. ఇదిగో ఈ పుస్తకం కూడా, ఆ బల్లమీదో, షెల్ఫులోనో పడేయి. టిఫిన్ ఏమైనా చేశావా, కారమా, తీపాయని ప్రశ్నల వర్షం కురిపిస్తాడు" సరస్వతి భర్త.

భర్త ఆజ్ఞలు నెరవేరుస్తూనే అవన్నీ సరే, ముఖం కడుక్కొని, తలదువ్వుకోండి. వోణియా, కోటా? ఏది తెమ్మంటారు? కాఫీ, టిఫిన్ పుచ్చుకొని త్వరగా తెమలండి అన్నది సరస్వతి.

మగవాడు ఇంట్లో అడుగు పెట్టగానే "మనకు విందు పెట్టాడే ఆ స్నేహితుడు" అని ఆడది ప్రారంభిస్తే ఆ మగవానికెలా వుంటుందో ఆలోచించండి.

ఆవిడేమో జోరుగా శృంగారించుకుంది. నడిమి పాపట (ఇప్పుడు ప్రక్కపాపిడి ఫాషన్ కాదుగా), వాలుజడ, జడకుప్పెలతో ప్రత్యక్షమైంది.

"త్వరగా కానీండి, కాఫీ చల్లారి పోతుంది." (ఇది మిష)

"ఏమిటి షాపింగా లేక సినిమాయా?"

"అబ్బా, మగవాళ్లంతా ఇంతేనా, లేక మీరేనా! బజారు అంటే పాముపుట్టమీద నడిచేటట్టు అట్లా వాడలి పోతారేమండీ! నాకేమక్కరలేదు. నేనేమి కొనుక్కోను కానీ" యన్నది.

"నీకేమక్కరలేదు కాని బజారు కెళ్లాలి? ప్రపంచములోని వింతలంటారే, దానికిది శిఖరంవంటిదన్నాడు భర్త.

"మీ స్నేహితుడు" అంది భార్య.

"మళ్లా స్నేహితుడంటావ్, ఎవరతను?"

"ఇప్పుడు పెళ్లైంది కాదండీ! పోయిన నెలలో"

"సరే, నా స్నేహితులకు దౌర్భాగ్యమందికి పోయిన నెలలో కారాగారవాసం ప్రాప్తించింది. ఇది సర్కార్ వారి శిక్షలాగా అయిదు సంవత్సరములు ఆరు సంవత్సరములు కాదు. యావజ్జీవము, ద్వీపాంతరవాస శిక్ష అయినా కొంత మేలే. ఉరి శిక్షకూడా నయమేననిపిస్తుంది. ఏమంటే ఒకేసారి ప్రాణాలు వదిలేస్తాడు ఉరికంబము మీద మానవుడు. ఇది దినదినము చావేగా!"

"ఏమి మాటలండీ కల్యాణమంటే కారాగారవాసమా? మీ డిక్షనరీలో కల్యాణానికి అదే అర్థము కాబోలు."

"అవును ఇదిగోవిను సంసారమనే చెరసాలకు, పిల్లలనే ఇనుప కట్టెల మూలమున, భార్యయనే జెయిలర్, భర్తయనే ఖైదీని, బంధించి, అందము చాక చక్యము, ఏడుపు, లాలనయను ఆయుధములతో భయపెడుతుంటుంది. వీటికే భయపడ్డట్టు, తుపాకికికూడా భయపడడు మానవుడు"

"చాలు మీ వుపన్యాసాలు. ఉపమానాలు బాగానే వున్నాయి. నా మాటకాస్త వినండి. ఆ పోలీస్ కమీషనర్ వీధిలో వున్నాడే మీ స్నేహితుడు"

"మళ్ళా, స్నేహితుడంటావు పేరు చెప్పరాదూ. రామారావా, సత్యనారాయణా, ఊగులాడే బసవన్నా?"

"మాటలతోనే ప్రొద్దుపోతున్నది. ఇంక షాపింగ్‌కు ఏమి వెళతాం?"

"నే చెప్పడం ఊర్మిళ మగడండీ"

"ఊర్మిళ మగడా, ఏ వూర్మిళ?"

"ఏమిటండి, ఇలా వేధిస్తారు? ఎర్రగా, కాటుకకండ్లు పెద్దముక్కు. అబ్బా ఇంకా తెలియలేదా? నాలుగు జతల రేడియో గాజులు వేసుకుంటుదే"

"గాజులే వేసుకుంటుందో, గొలుసులే వేసుకుంటుందో నాకేమి తెలుసు? నీ ఆనవాళ్లు ఏది నాకు జ్ఞాపకానికి రాలేదు. నీ మాటబట్టి చూస్తే నీవు చెప్పడం నస్యం నరసింహాన్న, వీశెలు వీశెలు నస్యం పీలుస్తాడు..."

"అవును మీ ఆనవాళ్లు మాత్రం ఏమంత సబబుగా వున్నది. నస్యమే పీలుస్తాడో, చుట్టే కాలుస్తాడో, ఎవరు ఎంత పొడిచేసేది నాకేమి తెలుసు. వాళ్లను మన యింటికి భోజనానికి పిలవ్వొద్దా?"

"సంతోషంగా పిలూ, నాకు పప్పు అన్నం దొరుకుతుంది. నీవు ఎవరిని భోజనానికి పిలిచినా నేవద్దనను."

"ఉత్తిని పిలవడం కాదండీ. వారికేదైనా ప్రెజెంటివ్వొద్దా?"

"ప్రెజెంటా, తప్పుతప్పు. ఈ రోజులలో అవన్నీ పెట్టి నా ప్రాణాలు తీయకు"

"అయ్యయ్యో, అలా అంటారేమండీ? వారు మనకిచ్చినపుడు మనము వారికియ్యొద్దా?

"ఏమిచ్చారు వారు మనకు"

"ఇదిగో, తొడుక్కున్నానే, ఈ పట్టు జాకీటు. వాళ్ళిచ్చినదే కాదూ! మనలను భోజనానికి పిలిచి ఇవ్వలేదూ"

జాకెట్టును ఎగాదిగా చూచాడు సరస్వతి భర్త.

"బాగానే వుంది. ఇలాంటిదే వొకటికొని, వాళ్ళ మొహాన పారేసి, ఆ వడ్డీలేని అప్పును తీర్చేయి"

"ఇలాంటిదేనా" యని నవ్వింది సరస్వతి.

"ఇలాంటిదికాక ఇంతకన్నా మంచిదివ్వాలా దీనికేమ"న్నాడు దిగ్భ్రమతో.

"ఇది ఊర్మిళకు బాగుండదండీ. ఇది కూడా తెలియదే" యని మళ్ళీ నవ్వింది.

"సరే, ఏది కావాలో, అదేకొను. నీ కెంత బట్టయిచ్చినది? గజమా, ¾ గజమా. ఆవిడకెంత కొనాలి? గజమా, గజ్జన్నరా?"

"ఏమిటండీ, మీ మాటలు నాకేమర్థమవుటలేదు."

"అర్థమవుట లేదు! అయితే వివరంగా చెప్తా విను. నీ కిచ్చిన బట్ట ఖరీదెంతో, అంత ఖరీదులో ఆమెకెంత బట్ట అవసరమో, అంతాకొని అర్పించూ"యని "సరేనా, ఇదిగో ఈ 10 రూపాయల నోటు పుచ్చుకో. ఈ వీధి చివర ఒక బట్టల దుకాణమున్నది. అక్కడికెళ్లి కొనుక్కో"

"ఊహు నేకొనుక్కోను. మీరు నాతో రావాలి. అది కాక మీరు చెప్పేది పటాటోపం అండ్ గ్రాండుసమ్స అన్న అంగడేనా? ఆ అంగట్లో అడుగు పెట్టలేము మనము. ఒకటే గుంపు. అల్లరి. ఇక వెలలా! దగ్గరకేపోలేము. యుద్ధము ముగిసినా ఇంకా ఆ వెలలే అక్కడ. ఆ అంగడి వొద్దండి" అన్నది.

"అన్ని అంగళ్లు అంతే. యుద్ధము ముగిసినా ఆ వెలలే యన్నావు. అది నయమేకాదూ. ఆ రోజులలో అమ్మిన వెలలకన్నా ఎక్కువ వెలలేకదూ ఇప్పుడు నీకు తెలియదూ?

"ఏమన్నా చెప్పండీ, ఈ అంగడివద్దండీ. మనం టౌన్‌కే పోదామండి.

"సరే, నీకు షికారు పోవలెనని వున్నది. బయలుదేరు." అన్నాడు సరస్వతి భర్త

తలవూపింది సరస్వతి.

"ఈ అంగడొద్దంటావ్ ఏమంత వెలలుంటాయి? ఇక్కడికన్నా అక్కడ అర్థో, పావలాయో తక్కువ వుంటుంది. ఈ బస్సు చార్జీ నీకు నాకు ముప్పావులాకాదూ! అది మనకెంత లాభం?"

"లాభమా, జార్జిటౌన్, చైనాబజారు వొకసారి చూచి వస్తాము. ఆ అంగళ్లు కలకల లాడుతు ఎంత బాగుంటాయండీ. ఈ వేళంతావున్నా ఇంకా అక్కడే వుండాలని వుంటుంది. అంగడి వదిలిపెట్టి రావాలెనని వుండనే వుండదు."

"అవును మరీ, మీబోటి వాళ్లుంటే కదా, వాళ్ళకు వ్యాపారం! ఆ అద్దాలు ఆ దీపాలు చూచి ఆనందిస్తూ వుంటారు. పదిమందిపోతే ఒకరైనా కొనరా? అదే చాలు వాళ్ళకి"

"పదిమంది కొనరా! అందరూ కొంటారు. ఎక్కడనో నాబోటివాళ్లు ఒకరిద్దరుతప్ప"

"సరే, అసంతృప్తి బయలుదేరింది. ఇక ఆలస్యం పనికి రాదు. పద త్వరగా,"యని తొందర పెట్టాడు భర్త.

ఇద్దరూ బయలుదేరారు గడపదిగుతూ "అర్ధరూపాయ కోసం అంతదూరం పోవాలా యన్నాడు"

"ఆ అర్ధరూపాయైనా ఎందుకివ్వాలి?" యని ఆర్థిక మంత్రి పన్నులు విధించేటప్పుడు చూపే ఉత్సాహంతో యన్నది.

ఈ ఎనిమిదణాలకోసం వాద ప్రతివాదములైనవి. కడపట సరస్వతే గెలిచినది. అర్ధ రూపాయ మిగుల్చుకుందామని బౌనుకే బయలుదేరారు. అయినా అక్కడికి ఇక్కడికి ఎంత తేడావుంటుందో తేల్చుకోవాలెనని యిద్దరికి బుద్ధి పుట్టినది ఎందుకో?

కనుక ముందు పటాటోపం వారికొట్లో దూరారు. దారిలోనే వున్నది వారి అంగడి. కొట్లో ప్రవేశించగానే సరస్వతి, తనకు నచ్చిన సిల్కు ఒకటితీసినది. Fixed Price 9 14-9 Per yard అన్న కాగితపు చీటి కట్టియున్నది. Fixed Price అంటే బేరంలేదు. పేచీ పెట్టకూడదు. ఖరారు వెల యనేగా. ఈ దంపతులు బట్టకొనలేదు. కాని వెల మాత్రం మనసులో పదిల పరచుకొని బయటికి వచ్చారు. అంగట్లో వారు "ఏమండీ, ఏమి కొనలేదే"యంటే "మళ్లా వస్తాము. రేపో, ఎల్లుండో"యన్నారు ఇద్దరు ఏక గ్రీవముగా.

ఇంట్లో సరేకాని గడప దాటిన వెనుక మగవారు వాళ్ళ పొదుపు చూపిస్తే (పొదుపంటే మాటలతోనేలెండి) వాళ్ళ పరువుపోతుంది. ఇంట్లోలాగ మాట, పైమాట వస్తే ఇంకే ముంది. అనకూడదు కాని ఆడదానికి మగవానికన్న గొంతుక పెద్దది. కనుక వీరివాదం టికెట్‌లేని డ్రామాయని మూగుతారు జనం. అప్రతిష్ఠ కూడాను.

ఇవన్నీ తెలిసిన విషయాలే కనుక సరస్వతిభర్త "గోవు వెంట నడుచు కోడెభంగి"భార్య ననుసరించాడు.

ఇద్దరూ బస్‌స్టాండ్‌కువచ్చారు. బస్‌లేదు. ఒక మైలువరకూ క్యూ నిలిచియున్నది. ఆ క్యూ చూస్తేనే గుండె దడ దడలాడింది. బస్‌కు ఒక దండంపెట్టి బండి చేసుకొని బౌనుకు చక్కా వెళ్ళారు.

బండినింపాదిగా నడుస్తూవుంటే ఊర్మిళా నరసింహారావులను భోజనానికి పిలిస్తే, వంటలు, పిండి వంటలు ఏమేమి చెయ్యాలో ఇంకా ఎవరినైనా పిలవాలో వాళ్లను ఎలా మెప్పించాలో, దిట్టం వేసుకుంటూ వెళ్లారు భార్యాభర్తలు.

"పాయసమా, బాదాంఖీరా, ఉర్లగడ్డలా, క్యాబేజా?" యంటూ పోయింది ధోరణి.

అది బాగానేవుంటుంది సుమండీ! పాఠకులకు తెలియదేమిటి?

తిన్నగా బౌనుకుచేరారు. బండి కుదుపులతో ఒళ్లుబాగా నలిగినది. అలసటైనది. కనుక కాఫీ హోటలుకు వెళ్లారు. ఇద్దరు హోటలునుండి బయటికివచ్చేసరికి పర్సులో 2-14-0 తగ్గినది. అంగడి అంగడికి వెళ్ళి ఊర్మిళకు తగ్గ బ్లౌస్ పీస్ చూచారు. దాని మీద వెల చూస్తే 9-2-9 అని అంటించి వున్నది.

సరస్వతి భర్త ముఖము చూచినది. "చూచారా 12 అణాలు మిగులేకదా"అన్న భావంతోవున్నదా ముఖం.

ఆ బట్ట ఒకగజం చింపించి పుచ్చుకొన్నారు. అంతటితో వూరుకోక సరస్వతి 'మీ అంగడి కన్న మైలాపూర్‌లో వున్న పటాటోపం వారి కొట్లో ముప్పావులా ఎక్కువ చెప్పారండి"

బట్టలమ్మే ఆయన "అవునమ్మా అందరికొట్లు కన్న మా కొట్లో వెల ఎప్పుడు సరసమే. మాకు మనుష్యులు మర్యాద

కావాలికాని, డబ్బు ప్రధానం కాదు. ఫలానా వారంగడని వచ్చినవారు పదిమందికి చెప్పి పంపేటట్టు వుండాలి. కనుకనే, ఈ వూళ్ళో పెద్దమనుష్యులందరు మా కొట్టుకే వస్తుంటారు "యని ఒక లెక్చరిచ్చి సరస్వతినికూడ ఇకముందు తమ కొట్టు తప్ప రెండవది కన్నెత్తి చూడకూడదని ఆర్డర్ ప్యాస్ జేశాడు.

ఆ బట్టకొనుక్కొని ఇంటి ముఖం పట్టాం మళ్లా బస్ స్టాండ్‌కొచ్చాం. ఒకే జన సముద్రం. చోటు దొరుకునో లేదో, యని సందేహిస్తూవుంటే స్నేహితుడు, సుబ్బారావు కారు, వారి ప్రక్కనవచ్చి ఆగింది.

" ఏమి బ్రదర్ ఇక్కడున్నావ్. ఇంటికేనా, ఎక్కు " అని కారు తలుపు తీశాడు.

సరస్వతి బస్ చార్జి మిగులేకాక, తానుదర్జాగా కారులో వెళ్ళడం ఇంటి ముందర కారునుండి దిగితే తన స్నేహితులు ఇరుగు పొరుగు వారు చూచి ఆశ్చర్య పోవడం, ఒకవేళ చూడకపోతే, వన్నెలు చిన్నెలు కల్పించి, తన గొప్ప చెప్పుకొనుటకు అవకాశము కలదుకదాయన్న తలంపుతో భర్తవైపు చూచినది. భర్తవద్దని సైగచేశాడు.

ఇదికనిపెట్టి సుబ్బారావ్ " ఏమి ఇంటికికాదా, సినిమా షో ఏమన్నావుందా ''యన్నాడు.

సరస్వతి భర్తకు గుండెలో రాయిపడ్డది. ఇపుడితను సినిమాకు తీసుకెళ్ళమంటూ డేమోయని " ఆ, సినిమా లేదు, మన్ను లేదు, సినిమాకు వెళ్ళడంలేదు. ఇంటికి కాదు ఇంకొక చోటికి వెళ్ళాలి. నీవు వెళ్లి నీ పనిచూచుకో, మేము వెళ్లుతాం "అన్నాడు. భర్తను వెనుకనుండి గిల్లినది సరస్వతి. " అయ్యో, డబ్బుకూడ పెట్టుకోవడం తెలియదు కదా '' యన్న భావాన్ని సూచించింది ఆ గిల్లడం.

" మీ ఇంటిమీదే పోతున్నాను. చీకటైంది కూడా. ఇంకెక్కడికి వెళ్తారు ? బస్సులో చోటు దొరకడం కూడా కష్టమే, కనుక ఎక్కండి "అన్నాడు సుబ్బారావు.

సరస్వతి చూపుల కాగలేక, వెనుక వచ్చు సాధింపులకు భయపడి సరస్వతి భర్త సమ్మతించాడు. కారులో కూర్చున్నారు దంపతులు. బండి కదిలినది. తుర్రుమని కొంతదూరం పోయి, పెట్రోల్ బంక్ దగ్గిర ఆగింది. పెట్రోల్ వేయగానే సుబ్బారావ్, జేబులు తడుముకొని, పర్సు తీశాడు. పర్సు అంతా పరికించి, తెల్లమొహం వేసి " బ్రదర్, ఒక 10 రూ చేబదులియ్యి. డబ్బు చూచుకోకుండా పెట్రోల్ పోయించా నన్నాడు.

ఏమిటి చేయడం ? బజారు కెళ్లడం అంటే, ఎప్పుడు కొంత డబ్బు అధికంగానే తీసుకెళ్ళడం సరస్వతి భర్తకు అలవాటే. ఏమంటే ఒకటికొనబోయి పదికొనడం సరస్వతి కలవాటు కాదనలేదు భర్త. కనుక ఇప్పుడు చేతిలో డబ్బున్నది. కారులో ఇంటికి వెళ్లడానికి ఇచ్చుకొన్న అద్దెలాగ పది రూపాయ లర్పించాడు.

" ఒకే, రేపు ప్రొద్దున, పది గంటలలోపల నీ డబ్బు పంపించేస్తా"నని, చిల్లర తనచేబులో వేసుకొన్నాడు.

సరస్వతి, భర్త జోరుగా వారింటి ముందర దిగారు. ఎవరైనా, ఒకరిద్దరన్నా చూడరాయని కొంత ఆలస్యంచేసే దిగినది సరస్వతి. వందనములు చెప్పారు. బండి తుర్రుమని పోయినది.

రోజులు గడిచిపోయినవి. సుబ్బారావ్ డబ్బుపంపలేదు. ఆ డబ్బుకోసమే తన్నంత బలవంతపరచి కారులో తీసుకొచ్చాడేమొ యని యనుకోక పోలేదు సరస్వతి భర్త.

ఊర్మిళా, నరసింహారావులను ఆహ్వానించి, విందుచేసి, రవికల గుడ్డపెట్టి తాంబూలంఇచ్చి పంపారు. ఆ బట్టచూచి ఊర్మిళ సరస్వతిని " ఇది పటాటోపం వారి కొట్లో కొన్నారా "యన్నది.

" లేదు. ఇక్కడ అన్యాయపు వెలలు టౌనులోకొన్నాను ఇక్కడికన్నా 12 అణాలు చౌక. నే నిక్కడ కొనలేదని మా వారికి సుర్రే ''యన్నది.

12 అణాలకోసం పట్నం వెళ్ళాలా యని వాదించారు. ఈ మాటలు సరస్వతి భర్త వినలేదు. వినివుంటే ప్రెజంట్ ఇచ్చిన బట్టవెల వ్యాఖ్యానము చేస్తారాయని, ఆ రోజు

ఈ బట్టవల్ల తనకెంత నష్టం కలిగినది జ్ఞప్తికివచ్చి కోపం వచ్చేదే.

కాని ఊర్మిళ, సరస్వతిని మెచ్చుకొని, "అయి నా మీకేమి ఓపికండీ"యని కొంతపొగడి, ఆవిడ భర్తకు అంత మాత్రం తెలియక పోయెనే యని కొంత వేళా కోళం చేసింది.

ఆడవాళ్లకున్న తెలివి, పొదుపు, మగవాళ్ల కుండదని, అయితే ఆడది అన్నీకొని, డబ్బుపాడు చేస్తుందని మగవాడాడి పోస్తాడని ఒక రిజల్యూషన్ ప్యాస్‌చేశారు ఇద్దరు.

తమాషా, ఏమంటే వాళ్ళ లెక్క ప్రకారం, సరస్వతి భర్త 12 అణాలు వృధా ఖర్చు చేయపోతే సరస్వతి తప్పించిందని. అయితే అయిన వ్యయ మెంత? అది ఎవరి వలన అయినది. ఒక్క నిమిషమాలోచించండి.

లెక్క చెప్తాను చూడండి.

బొనకు బండి అద్దె	0-14-0
హోటేలు ఖర్చు	2-14-0
ఖిల్లీలు	0- 1 -0
పూలు	0- 3 -0
మళ్లీ ఇంటికిరాను స్నేహితుని కర్పించినది.	10-0-0
మొత్తం	14-0-0

ఒక గజం (రవిక గుడ్డకు) బ్లౌస్‌పీస్‌కు బట్టకాక అధిక వ్యయం 14 రూపాయలు.

ఇది కూడికంటూరా? కాదూ,

కాదంటే సరస్వతి వొప్పుకోదే! ఏమి చేయమంటూరు. 12 అణాలు కూడికే యంటుంది, ఎన్నిమార్లు ఎన్ని విధాల బోధించినా!

"అక్క"

★

ఆంధ్ర మహిళాసభ స్త్రీ, శిశువుల సంరక్షణశాలకు శంకుస్థాపన చేయవచ్చుచున్న గౌ॥ రాజకుమారి అమృతకౌర్‌గారిని, ఆహ్వానించుచున్న శ్రీ దుర్గాబాయమ్మగారు